# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అన్ని రంగాల్లో గిరిజనులు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాక్షించారు.
- ❖ రాష్ట్రానికి 5 వేల 743.90 కోట్ల రూపాయల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు విడుదల అయ్యాయని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ వెల్లడించారు.
- ❖ ఆర్టీసీ, రవాణా శాఖలపై ఈనెల 12వ తేదీన ముఖ్యమంత్రి సమీక్ష చేపడతారని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తెలియజేశారు.
- ❖ సముద్రంపై చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ట్రాన్స్ పాండర్లను ఉచితంగా సరఫరా చేస్తున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.
- ❖ విజయనగరంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

=======================

అన్ని రంగాల్లో గిరిజనులు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాక్షించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన "ప్రపంచ ఆదివాసీ దినోత్సవం"లో ఈరోజు ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్రిటిష్ పాలన అంతమొందించడానికి పోరాడి ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాగలిగారని.. అంచెలంచెలుగా ఎదిగిన ఆమెను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆఫ్రికా తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో గిరిజనులు ఉండే దేశం భారత్ అని.. మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు అభివృద్ధి చెందాలని అన్నారు. ఆదివాసీలంటే శౌర్యం, సహజ ప్రతిభ, నైపుణ్యం కలిగిన వ్యక్తులని... 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 27.39 లక్షల మంది ఉన్నారుని చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

శాస్త్రసాంకేతిక పరిశోధనలపైనే సమాజ పురోగతి ఆధారపడి వుంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మత్స్య రంగంలో "స్పేస్ టెక్నాలజీ వినియోగం" అనే అంశంపై విశాఖలో జరిగిన కార్యశాలలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని మత్స్యకారులు, బోట్ యజమానులకు ఉచితంగా ఇవ్వనున్న ట్రాన్స్ పాండర్ పరికరాల వినియోగంపై అవగాన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సముద్రంపై చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అవగాహన లేక అంతర్జాతీయ సరిహద్దులు దాటి చిక్కుల్లో పడుతున్న సంఘటనలు చూస్తున్నామని, ఇక పై ఆ సమస్యలు రాకుండా శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తూ.. ట్రాన్స్ పాండర్లను ఉచితంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. విశాఖ జిల్లాలో ఒక వెయ్యి 80 యూనిట్లను మత్స్యకారులకు కేటాయించామని కలెక్టర్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 5 వేల 743.90 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 - 25కు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ వేతనాల చెల్లింపుల నిమిత్తం 21.5 కోట్ల పనిదినాలకు గానూ 5 వేల 743.90 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. కాగా గతంలో ఆమోదించిన 15 కోట్ల పని దినాలకు సంబంధించి వేతన నిధులు 2 వేల 934.80 కోట్ల రూపాయలు మంజూరు చేసి విడుదల చేసిందనీ, అదనంగా ఇప్పుడు 2 వేల 812.98 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ... కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు ఇచ్చిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ, రవాణా శాఖలపై ఉన్నతాధికారులతో రాష్ట్ర సచివాలయంలో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కారుణ్య నియామకాలపై చర్చించామన్నారు. రాష్ట్రంలో రేషన్, మైన్స్ అక్రమ రవాణాను నివారిస్తామని, ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను తొలగించి, కొత్తవి తీసుకొస్తామని తెలిపారు. ఆర్టీసీలో 7 వేల మంది సిబ్బంది కొరత ఉందని.. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. ఆర్టీసీ, రవాణా శాఖలపై ఈనెల 12వ తేదీన మరోసారి ముఖ్యమంత్రి సమీక్షిస్తారని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మొబైల్ ఫోన్లు దొంగలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, చాట్ బాట్ సేవల ద్వారా బాధితులకు న్యాయం చేస్తున్నామని అనంతపురం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మురళి కృష్ణ తెలిపారు. ఈరోజు అనంతపురం పోలీసు సూపరెండెంట్ కార్యాలయంలో పోలీసు శాఖ పట్టుకున్న మొబైల్ ఫోన్లను ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మొబైల్ వినియోగదారులు వారి మొబైల్ చోరీకి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మొబైల్ చోరీకి గురైనా, మిస్ అయినా చాట్ బాట్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న CEIR ద్వారా నమోదు చేసుకోవాలని, బిల్లులు లేకుండా సెల్ ఫోన్ అమ్మే వ్యక్తుల నుండి గాని, సెల్ ఫోన్ దుకాణాలు ద్వారా గాని కొనుగోలు చేయవద్దని కోరారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాలలో అనుమానాస్పదంగా సంచరించే వారిపై సమీపంలోని పోలీసు స్టేషన్ కు లేదా డయల్ - 100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, జుయాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్, బీబీఏ టూరిజం - హాస్పిటాలిటీ మేనేజ్మెంట్లలో అడ్మిషన్ కోసం నమోదు చేసుకోవచ్చని ఈ నోటిఫికేషన్ లో తెలిపారు. ఇటీవలే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) నిర్వహించిన CUET (అండర్ గ్రాడ్యుయేషన్) పరీక్ష రాసిన వారు అందరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని తెలిపారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు www.ctuap.ac.in గానీ, ctuapcuet.samarth.edu.in ద్వారా గానీ తమ పేరును ఈ నెల 16వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం క్యాంపస్ లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను లేదా ఫోన్ నెంబర్ 08922-96033 నంబర్ ను గానీ యూనివర్సిటీ పని వేళలలో సంప్రదించాలని ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్య్ర వేడుకల నిర్వహణపై రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ విభాగం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని వెల్లడించింది. కాకినాడలో ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్ దినేశ్ కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్టణం - సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు షెడ్యూల్‌లో అధికారులు మార్పులు చేశారు. డిసెంబరు 10వ తేదీ నుంచి ఈ రైలుకు ప్రతి మంగళవారం సెలవు ప్రకటించారు. కాగా ప్రస్తుతం ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఈ రైలు సర్వీసులు అందిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =